క్లుప్తంగా

కారు బోల్తా

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జాతీయ రహదారి నుంచి రుషికొండకు వెళ్లే మార్గమధ్యలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం సాయంత్రం ఎండాడ నుంచి వస్తున్న ఓ కారును ఎదురుగా వస్తున్న మరో కారు బలంగా ఢీకొట్టడంతో ఒకటి బోల్తా పడింది. అయితే ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పీఎం పాలెం పోలీసులు తెలిపారు.

గీతం వర్సిటీతో స్మార్ట్‌జెన్ ఒప్పందం

కొమ్మాది: ఇంజినీరింగు విద్యలో వివిధ కోర్సులకు సులభంగా అర్థమయ్యేరీతిలో యానిమేషన్ వీడియో తయారు చేయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో స్మార్ట్ జెన్ సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు. ఇంజినీరింగు విద్యను యానిమేషన్ సహాయంతో బోధించాలనే నిర్ణయం సరికొత్తదన్నారు. ఈ ఆలోచన విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ జెన్ సీఈవో నవీన్ గీతం రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డైరెక్టర్ డాక్టర్ రాజాఫణి పాల్గొన్నారు.

గాంధీ బజార్‌కు విశేష స్పందన



చెక్కతో తయారు చేసిన బొమ్మలు

పీఎం పాలెం: శిల్పారామం (జాతర)లో ఏర్పాటు చేసిన గాంధీ బజార్ లేపాక్షి హస్తకళల చేనేత ఉత్పత్తుల ఎగ్జిబిషన్ కమ్ స్టాల్స్ వినియోగదారులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. తయారీ ధరకే వస్తువులను విక్రయించడం ఈ బజారు ప్రత్యేకత. ఈ స్టాల్స్‌లో ప్రదర్శనకు ఉంచిన ఆర్టికల్స్‌లో మేక తోలుపై వేసిన అందమైన పెయింటింగ్స్, ఏటికొప్పాక చెక్కబొమ్మలు, గోగు నారతో తయారు చేసిన సంచులు, బ్యాగులు, చెక్క ఊయల బొమ్మలు, సముద్రపు గవ్వలు, శంకాలతో తయారు చేసిన ఆర్టికల్స్, చేనేత వస్త్రాలు లభిస్తున్నాయి. స్టాల్స్ నిర్వాహకులకు అవసరమైన సదుపాయాలు కల్పించామని స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథ రెడ్డి తెలిపారు.

జ్వరంతో చేర్పిస్తే రూ.2లక్షల బిల్లు వేశారు

కేర్ ఆస్పత్రిపై బాధితురాలి బంధువుల ఆరోపణ

మహారాణిపేట: టైఫాయిడ్ జ్వరంతో తన కుమార్తె(వైద్య విద్యార్థిని)ను విశాఖ కేర్ ఆస్పత్రిలో చేర్పిస్తే రూ.2లక్షల బిల్లు వేసి వేధిస్తున్నారని ఆమె తండ్రి జయరామ్ ఆరోపించారు. దీనిపై గురువారం ఆమె బంధువులు ఆందోళన చేపట్టి.. ఆస్పత్రి వర్గాలతో వాగ్వాదానికి దిగారు. ఆమె తండ్రి తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం రిమ్స్‌లో రేడియాలజీ విభాగంలో టి.స్పందన పీజీ చేస్తున్నారు. ఆమెకు జ్వరం రావడంతో ఈ నెల 26న రామ్‌నగర్‌లోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. నాలుగు రోజుల తర్వాత రూ.2లక్షల బిల్లు వేసి, చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. జ్వరం ఏమాత్రం తగ్గలేదని.. ఇంజక్షన్లు కూడా తెలియని కంపెనీలవి వేశారని అతను ఆరోపించారు. 'వైద్యం చేసిన తర్వాత కొద్ది రోజులకు నయం అవుతుంది. ఆస్పత్రిలో వైద్యం చేసుకోవడం ఇష్టం లేకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. బిల్లు ఇంకా చెల్లించలేదు'అని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

నేడు కళాకారులకు పురస్కారాలు

దాబాగార్డెన్స్: విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న ఉగాది విశిష్ట కళా పురస్కారాలు అందజేయనున్నట్టు సంఘం అధ్యక్షుడు కె. జనార్దన్ తెలిపారు. ఈ మేరకు గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్ ఆవిష్కరించి, కార్యక్రమ వివరాలు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా పలువురు ప్రముఖుల చేతుల మీదుగా సినిమా, నాటక, పౌరాణిక, తబలా, మ్యూజిక్, సింగింగ్, మిమిక్రీ, వెస్టర్న్ డ్యాన్స్, జానపద విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలతో సత్కరించనున్నట్టు చెప్పారు.

కమనీయం.. రాములోరి కల్యాణం

- వైభవంగా శ్రీరామనవమి పూజలు
- సీతారాముల దర్శనం కోసం బారులు తీరిన భక్తజనం



సెక్టార్-6లో ప్రత్యేక అలంకరణలో సీతారాములు



కేఆర్‌ఎం కాలనీలో అన్నదానం చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల



ఆరిలోవ దుర్గాబజార్ రామాలయంలో దర్శనమిచ్చిన సీతారాములు



చినగదిలి నార్త్ షిర్డీ సాయి ఆలయ ప్రాంగణంలో భోజనాలు చేస్తున్న భక్తులు



సెక్టార్-9లో శ్రీ సీతారాములకు అభిషేకం చేస్తున్న భక్తులు

ఆరిలోవ: సీతారాముల కల్యాణం వాడవాడలా కమనీయంగా సాగింది. తూర్పు నియోజకవర్గంలో శ్రీరామనవమి వేడుకలు గురువార వైభవంగా జరిగాయి. సీతారాముల దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచి ఆలయాల వద్ద బారులు తీరారు. ఉదయం స్వామి వారి కల్యాణం, సాయంత్రం భజనలతో పల్లకీ సేవ కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆరిలోవ దుర్గాబజార్ వద్ద రామాలయంలో సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇక్కడ వందలాది మంది భక్తులు కల్యాణం వీక్షించి తరించారు. చినగదిలిలో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో అంజనేయస్వామి గుడి వద్ద రాములోరి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఇక్కడ స్వామి కల్యాణం అనంతరం మధ్యాహ్నం భక్తులకు మహా అన్నసమారాధన చేపట్టారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులు సంప్రదాయబద్ధంగా నేలపై కూర్చొని సహ పంక్తి భోజనాలు చేశారు. పైనాపిల్ కాలనీ, ఎస్‌జీ నగర్, ఇందిరానగర్, విశాలాక్షినగర్‌లోని రామాలయాలు, హనుమంతవాక వద్ద కోదండ రామాలయం, వెటర్నరీకాలనీ, శ్రీహరినగర్, భరత్‌నగర్‌లలో వేంకటేశ్వర స్వామి, శ్రీకాంత్‌నగర్‌లో ఆంజనేయస్వామి ఆలయాలలో సీతారామ కల్యాణం జరిపారు. ఆయా ఆలయాలలో సీతారాములను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్ పర్సన్ అక్కరమాని విజయనిర్మల దర్శించుకుని పూజలు చేశారు. దుర్గాబజార్, పైనాపిల్ కాలనీ రామాలయాల్లో 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత పూజలు చేశారు.

ఎంవీపీ కాలనీ: సెక్టార్-6లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అనంతరం తలంబ్రాలు సమర్పణ, రామాయణ నృత్యరూపకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం అర్చకులు భక్తులకు పట్టాభిషేక ఘట్టాన్ని వివరించారు.

- ఎంవీపీ కాలనీ సెక్టార్-9 మూలపాలెంలోని శివాలయంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత సీతారాములకు పంచామృతాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, పార్టీ 18వ వార్డు ఇన్‌చార్జి ధనలక్ష్మి, జ్యోతి, ధన పాల్గొన్నారు.

మద్దిలపాలెం: స్థానిక అలయెన్స్ కాలేజ్ ఆఫ్ హోటల్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ కొల్ల సతీష్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదానం చేశారు. సాయంత్రం సీతమ్మవారికి కుంకుమ పూజ, శ్రీరామ పట్టాభిషేకం, ఊరేగింపు కార్యక్రమాలు కనుల పండువగా సాగాయి.

- జీవీఎంసీ 15వ వార్డు కేఆర్‌ఎం కాలనీ రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీబీసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, గుడ్ల సత్యారెడ్డి పాల్గొని సీతారాములకు పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్ని భక్తులకు ప్రసాద వితరణ చేశారు.
- జీవీఎంసీ 15వ వార్డు కెల్లావారి వీధిలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు పాల్గొన్ని పూజల చేశారు.
- ఇసుకతోట శివ శంకరయ్యా కాలనీలోని మురళీకృష్ణ మందిరంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వి.చంద్రశేఖర్, వి.సాంబమూర్తి, కోశాధికారి శాస్త్రి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ప్రభాకరరావు.. సీతారాముల కల్యాణాన్ని వేద మంత్రోచ్ఛారణల నడుమ ఘనంగా చేశారు. అనంతరం 3 వేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి శోభాయాత్ర కోలాటం నడుమ కనుల పండువగా సాగింది.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డుశివాజీపాలెం, పిఠాపురం కాలనీలోని సాయిబాబా గుడి వద్ద శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతాల గోవింద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూరిబాబు, బాషా, కిరణ్, చంటి, శ్రీనివాస, తదితరులు పాల్గొన్నారు.



ఇసుకతోటలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఊరేగింపు చేపడుతున్న అలయన్స్ కళాశాల సిబ్బంది



ఇసుకతోటలో అన్నదానం చేస్తున్న భక్తులు



రామాయణం నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు



22వ వార్డులో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న పీతల గోవింద్

పారిశుధ్య విధులు.. పర్యావరణ హితం

- 75 బ్యాటరీ వెహికల్స్ అందుబాటులోకి తెచ్చిన జీవీఎంసీ
- ప్రారంభమైన లాసన్స్‌బే కాలనీలో సెంటర్ సేవలు



లాసన్స్ బేలో లోహియా సంస్థ అందుబాటులోకి తెచ్చిన చార్జింగ్ పాయింట్స్ సెంటర్



జీవీఎంసీ అందుబాటులోకి తెచ్చిన ఈ-వెహికల్స్

ఎంవీపీ కాలనీ: కాలుష్యాన్ని నివారించడమే లక్ష్యంగా జీవీఎంసీ మరో ముందడుగు వేసింది. పారిశుధ్య, ప్రజా రవాణా విధుల్లో సేవలందించేందుకు వీలుగా లోహియా కంపెనీకి చెందిన 75 ఎలక్ట్రికల్ (బ్యాటరీ) ఆటోలను జీవీఎంసీ అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా విస్తృతంగా పారిశుధ్య పనులు నిర్వహించనున్నారు. ఈ వాహనాల నిర్వహణకు మూడు సెంటర్లు సేవలు అందించనున్నాయి. ఈ 75 వాహనాలలో జీవీఎంసీ జోన్-1 పరిధిలోని ముడసర్లోవ సెంటర్‌కు 20 వాహనాలు, జోన్-5 పరిధిలోని టౌన్ కొత్తరోడ్డు సెంటర్‌కు 20 వాహనాలు, జోన్-3 పరిధిలోని లాసన్స్‌బే కాలనీ సెంటర్‌కు 35 వాహనాలు కేటాయించారు. ఇందులో 10 వాహనాలను ప్రజా రవాణాకు సైతం వినియోగించనున్నారు. జీవీఎంసీ పారిశుధ్య విధుల్లో చార్జింగ్ వెహికల్స్ ప్రాధాన్యం పెంచడం ద్వారా నగరంలో కాలుష్యాన్ని నియంత్రించనున్నారు.

సేవలు అందించనున్నాయ్ ఇలా..

రూ.30 కోట్లతో జీవీఎంసీ ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా లోహియా సంస్థ ఆయా వాహనాలకు మూడు సెంటర్లలో చార్జింగ్ సదుపాయం కల్పించింది. ఆయా సెంటర్లలో అందుబాటులో ఉంచిన వాహనాల ద్వారా రోజూ నగర వీధుల్లో చెత్తను సేకరించనున్నారు. లాసన్స్ బే కాలనీ సెంటర్‌కు కేటాయించిన 35 వాహనాల్లో 10 వాహనాలు ప్రజా రవాణాకు కూడా ప్రయోగాత్మకంగా వినియోగించనున్నారు. ఈ వాహనాలు 3 నుంచి 4 గంటల చార్జింగ్ పెట్టడం ద్వారా 80 కిలోమీటర్లు ప్రయాణించనున్నాయి. కిలో మీటరుకు 50 పైసలు ఖర్చుతో సేవలందిస్తాయి. ఈ వాహనాలకు జీపీఎస్ ట్రాక్ సిస్టం కూడా అనుసంధానం చేసి ఉంటుంది.

కాలుష్య నివారణకు అవకాశం



జీవీఎంసీ, లోహియా సంయుక్తంగా అందుబాటులోకి తెచ్చిన ఈ ప్రాజెక్టు ద్వారా రెండు రకాల ప్రయోజనాలు ఉన్నాయి. అత్యంత తక్కువ వ్యయంతో ఈ బ్యాటరీ వెహికల్స్ నిర్వహణ చేపట్టడంతో పాటు వాహన కాలుష్యం ద్వారా పర్యావరణానికి కలిగే నష్టాన్ని పూర్తిస్థాయిలో అరికట్టవచ్చు. ఈ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా ఈ సెంటర్లు సేవలు ప్రారంభించారు. లోహియా సంస్థ ఆయా సెంటర్ల ద్వారా వాహనాల చార్జింగ్‌తో పాటు నిర్వహణ బాధ్యతను నిర్వర్తిస్తోంది. రానున్న రోజుల్లో ఈ సేవలు మరింత విస్తరించే అవకాశం ఉంది.

– సంతోష్‌కుమార్,
సెంటర్ మేనేజర్, లాసన్స్‌బే కాలనీ

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేసి, 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు చిన్నా తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీవరాహ నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మంపడంలో వేంయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

'చేయూత'తో మహిళలకు ఆర్థిక భరోసా

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల
- 18వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళల బంగారు భవిష్యత్ సాధ్యమైందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. 18వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అంజయ్యనగర్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి ధనలక్ష్మితో కలిసి అక్కరమాని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరించారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ మహిళల కష్టాలను తీర్చేందుకు, వారిని అభివృద్ధి ముంగిట నిలిపేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. డ్వాక్రా రుణాలు ద్వారా మహిళల స్వయం సంవృద్ధికి తోడ్పడుతున్నట్టు చెప్పారు. వైఎస్సార్ చేయూత, అమ్మఒడి పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ సంక్షేమాన్ని వివరిస్తున్న అక్కరమాని, తదితరులు

ముడసర్లోవలో జీ-20 ప్రతినిధుల సందడి

ఆరిలోవ: జీ-20 ప్రతినిధులు ముడసర్లోవ ప్రాంతంలో గురువారం సందడి చేశారు. నగరంలో మూడు రోజులుగా జీ-20 దేశాల సదస్సు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మధ్యాహ్నం 3.30 గంటలకు ఆ దేశాల ప్రతినిధులు ముడసర్లోవ రిజర్వాయరులో జీవీఎంసీ నిర్వహిస్తున్న ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను సందర్శించారు. ముందుగా స్వదేశీ, విదేశీ ప్రతినిధులు ఉన్న బస్ పోలీస్ బందోబస్తుతో బీఆర్‌టీఎస్ రోడ్డులో ఈ ప్లాంట్ వద్దకు చేరుకుంది. దీని కోసం బీఆర్‌టీఎస్‌లో గురువారం ఉదయం నుంచి పోలీసులు అటు హనుమంతవాక నుంచి రామకృష్ణాపురం కూడలి వరకు, ఇటు ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ నుంచి ప్లాంట్ వరకు బందోబస్తు నిర్వహించారు. ప్లాంట్ ఆవరణలో 20 దేశాలకు చెందిన జాతీయ జెండాలను వరుసుగా ఏర్పాటు చేసి ప్రతినిధులకు అధికారులు స్వాగతం పలికారు. సాయంత్రం 4.30 గంటలకు వరకు ఈ ప్లాంట్‌ను పరిశీలించారు. రిజర్వాయరులో ఏర్పాటు చేసిన సోలార్ పలకలను ఆసక్తిగా తిలకించారు. ప్లాంట్ నుంచి ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.. దాన్ని ఏవిధంగా వినియోగిస్తున్నారు.. తదితర వాటి గురించి అధికారులు ప్రతినిధులకు వివరించారు. రక్షణ చర్యల్లో భాగంగా అధికారులు రిజర్వాయరు ఒడ్డున రెండు బోట్లు, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. అనంతరం అక్కడి నుంచి మాధవధార బయలుదేరారు.



ముడసర్లోవలో ఏర్పాటు చేసిన జీ-20 దేశాల జాతీయ జెండాలు

జిందాల్ ప్లాంట్ పరిశీలన

మధురవాడ: మధురవాడలో గల జిందాల్ గ్రూప్ వేస్టు టూ ఎనర్జీ ప్లాంట్‌ను గురువారం జీ - 20 ప్రతినిధి బృందం సందర్శించింది. 20 దేశాల ప్రతినిధులు జిందాల్ గ్రూప్ మేనేజ్‌మెంట్‌తో మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్మిన్ జిందాల్ మాట్లాడుతూ యాక్సిసబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రవాణా, జీవన నాణ్యతను ప్రతినిధులకు వివరించారు. వేస్టు టు ఎనర్జీ రీసైక్లింగ్ ఎనర్జీ ప్లాంట్ వ్యర్థాల నుంచి రోజుకు 15 ఎమ్‌డబ్ల్యూ శక్తి ఉత్పత్తి చేస్తుందని తెలిపారు.



జిందాల్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న జి - 20 ప్రతినిధులు

1న మానవహారం

సీతంపేట: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏప్రిల్ 1న నగరంలో నిర్వహించనున్న మానవహారంలో కార్మికులు, ప్రజానీకం పాల్గొని బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామన మూర్తి పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలంటూ నరసింహనగర్ జాతీయ రహదారి వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న నిరసన దీక్షలకు ఏప్రిల్ 1 నాటికి రెండేళ్ల పూర్తవుతాయన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

బీచ్ రోడ్డు: ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు గాయాలు పాలయ్యారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గురువారం సాయంత్రం ఏయూ మెయిన్ గేట్ వద్ద రోడ్డు దాటుతున్న ఒక మహిళ, మరో వ్యక్తిని సిరిపురం వైపు బైక్‌పై వెళ్తున్న యువకుడు ఢీకొట్టాడు. దీంతో ఆ ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.




అంజికాబాగ్ రామాలయంలో సీతారాములను దర్శించుకుంటున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి, శ్రీనివాస్ దంపతులు

జీ-20 ఖర్చుపై శ్వేత పత్రం విడుదలకు డిమాండ్

ఆరిలోవ: నగరంలో జరుగుతున్న జీ-20 సదస్సు కోసం జీవీఎంసీ ఖర్చు చేసిన నిధులపై వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. బీచ్‌రోడ్డు పక్కన తెన్నేటి పార్కులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మంగా జరుగుతున్న జీ-20 సదస్సు కోసం జీవీఎంసీ అధికారులు కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. అభివృద్ధి పనులను జాతీయ రహదారి, బీచ్‌రోడ్డుకే పరిమితం చేశారని చెప్పారు. సీతకొండ, తెన్నేటి పార్కు వద్ద రాళ్లపై పెయింటింగ్ వేయడానికి రూ.30 లక్షలు ఖర్చు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సదస్సు కోసం చేసిన రూ.150 కోట్లు ఖర్చుపై సమీక్ష జరిపాలన్నారు. అలాగే ఈ సదస్సుకు నగర ప్రథమ పౌరురాలిని ఆహ్వానించకపోవడం దారుణమన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



సహస్ర తులసి పూజలో సిరులతల్లి